
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం | 18 | సెప్టెంబర్ | 2025



సోమశిలలో 72.690 టీఎంసీలు

సోమశిల:జలాశయంలో బుధవారానికి 72.690 టీఎంసీలు ఉన్నాయి. 12,649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డెల్టాకు 1450, కండలేరుకు 10,450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,13,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,208
3 శాతం జీఎస్టీతో	రూ.10,514
నవర (8 గ్రా)	రూ.84,112

గరిష్టం/కనిష్టం
35.8 /26.8

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. బుధవారం తేమ 70 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

21న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి సీనియర్స్ పురుషులు, సబ్ జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్లను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం ఉదయం పది గంటలకు ఎంపిక చేయనున్నామని అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి కామేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ బాలబాలికలు 2011, జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌తో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని, వివరాలకు 97036 54315, 80742 99640 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డిజిటల్ మారథాన్‌లో భాగస్వాములుకండి

నెల్లూరు రూరల్: ఆంధ్ర యువ సంకల్ప్ రాయబారి డిజిటల్ మారథాన్‌లో యువత భాగస్వాములు కావాలని సెట్నెల్ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు తమ పేర్లను ఈ నెల 30లోపు నమోదు చేసుకోవాలని కోరారు. 120 సెకన్ల నిడివి గల వీడియో పార్ట్‌లను అధికారిక హ్యాష్ ట్యాగ్‌తో సొంత సోషల్ మీడియా ద్వారా చేయాలని సూచించారు. ఎంట్రీలను జ్యూరీ సమీక్షించి, ఉత్తమమైన వాటిని షార్ట్ లిస్ట్ చేసి విజేతలను ప్రకటించనుందని వివరించారు. మొదటి మూడు బహుమతులుగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలను అందజేయడంతో పాటు తొమ్మిది మంది విజేతలను ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్‌గా సత్కరించనున్నామని ప్రకటించారు. పాల్గొన్న అందరికీ డిజిటల్ క్రియేటర్ ఏపీ 2కే25 సర్టిఫికెట్లను అందజేయనున్నామని తెలిపారు.

ఐ అండ్ పీఆర్ డీడీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు రూరల్: జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలను వేణుగోపాల్‌రెడ్డి బుధవారం స్వీకరించారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏడీగా ఉన్న ఆయన్ను ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమించారు.

11 బార్లకు దరఖాస్తుల దాఖలు

నెల్లూరు(క్రైమ్): బార్లకు దరఖాస్తుల దాఖలుకు గడువును పొడిగించినా, వ్యాపారుల స్పందన నామమాత్రంగానే ఉంది. జిల్లాలో 33 బార్లకు రీనోటిఫికేషన్‌ను ఎక్సైజ్ అధికారులు ఈ నెల మూడున జారీ చేశారు. ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ విధానాల్లో 14వ తేదీ సాయంత్రం ఆరు వరకు దరఖాస్తుల స్వీకరణ.. లాటరీ డ్రాను 15న నిర్వహించాల్సి ఉంది. అయితే 11వ తేదీ నాటికి కేవలం ఐదు బార్లకే దరఖాస్తులొచ్చాయి. దీంతో స్వీకరణ గడువును బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించారు. ఈ క్రమంలో చివరి రోజు నాటికి నెల్లూరులోని ఆరు బార్లకు 24.. కావలిలోని మూడింటికి 12.. బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు పంచాయతీల్లోని రెండింటికి ఎనిమిది దరఖాస్తులు దాఖలయ్యాయి. మొత్తంగా ఇప్పటి వరకు పది బార్లకు 44 దరఖాస్తులొచ్చాయి. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో కలెక్టర్ సమక్షంలో లాటరీ డ్రాను గురువారం ఉదయం తొమ్మిది గంటలకు తీయనున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ బుధవారం అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. స్వామివారిని మంగళవారం అర్ధరాత్రి వరకు 63,607 మంది దర్శించుకున్నారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు మూడు గంటల్లోనే దర్శించుకోగలుగుతున్నారు.

హాత.. విధీ

గుండెల్ని పిండే విషాదం | మృత్యువై దూసుకొచ్చిన ఇసుక టిప్పర్



విధి..ఐదు కుటుంబాల్లో గుండెలు పిండే విషాదాన్ని నింపింది. అందరూ దగ్గరి బంధువులే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువును పరామర్శించేందుకు కారులో బయల్దేరిన వీరిని ఇసుక టిప్పర్ మృత్యువై కబళించింది. మృతుల్లో రెండు కుటుంబాల భార్యాభర్తలు ఉన్నారు. మహిళలిద్దరూ తోబుట్టువులు. వీరి మరణంతో ఆ దంపతుల బిడ్డలు అనాథలయ్యారు. అంతులేని విషాద ఘటనకు సంబంధించి బంధువులెవర్ని కదిలించినా కన్నీటి సుడులు.. గుండెలవిసే ఆవేదన పెల్లుబుకుతోంది. అధికార పార్టీ నేతల ధనదాహానికి ఏడు నిండు ప్రాణాలు క్షణాల్లో గాల్లో కలిసిపోయాయి. ఆ కుటుంబాలు కకావికలమయ్యాయి.

- పరామర్శకు వెళ్తున్న ఏడుగురి ప్రాణాలను కబళించి
- మృతులందరూ బంధువులే
- కకావికలమైన కుటుంబాలు
- అనాథలైన పిల్లలు



శ్రీనివాసులు (ఫైల్)



లక్ష్మి (ఫైల్)



సారమ్మ (ఫైల్)



బాలవెంగయ్య (ఫైల్)



తాళ్లూరు రాధమ్మ (ఫైల్)



గుండెలవిసేలా రోదిస్తున్న బాలవెంగయ్య సతీమణి శారదమ్మ



కారును ఢీకొన్న ఇసుక టిప్పర్ ఘటనా స్థలం



ఆత్మకూరు ఆస్పత్రి వద్ద విలపిస్తున్న డ్రైవర్ బ్రహ్మయ్య తల్లి వెంకటరమణమ్మ, అక్క పార్వతి

సంగం / నెల్లూరు (క్రైమ్) / ఆత్మకూరు / నెల్లూరు(పొగతోట): ఇసుకాసురుల ధనదాహం.. ఏడుగురి ప్రాణాలను బలిగొంది. మద్యం మత్తులో డ్రైవర్ భారీగా ఇసుక లోడ్‌తో మితిమీరిన వేగంతో రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో మృత్యుఘోష మిన్నంటింది. సంగం మండలం పెరమన సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంతో మృతుల కుటుంబాలు కకావికలమయ్యాయి.

బావను పరామర్శించేందుకెళ్తూ..

బాలవెంగయ్య, తాళ్లూరు రాధమ్మ, చల్లగుండ్ల లక్ష్మి అన్నా చెల్లెళ్లు. మరో చెల్లెలు లక్ష్మి భర్త మధు ప్రస్తుతం వింజమూరు మండలం తక్కెళ్లపాడులో ఉంటున్నారు. మధు ఈ నెల 16వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను పరామర్శించేందుకు శేషం బాలవెంగయ్య, వదిన శేషం శారమ్మ, బావలు, చెల్లెళ్లు తాళ్లూరు రాధమ్మ, శ్రీనివాసులు దంపతులు, చల్లగుండ్ల లక్ష్మి, శ్రీనివా సులు దంపతులు బుధవారం ఉదయం సుమారు 10 గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి తమ కారులో బయల్దేరారు. మరికొన్ని నిమిషాల్లో చేరుకుంటారనుకున్న వీరి కారును ఇసుక అక్రమ రవాణా సాగించే టిప్పర్ మృత్యుశకటమై కబళించేసింది. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన భార్యాభర్తలు మృతి చెందడంతో వారి పిల్లలు అనాథలుగా మిగిలిపోవడం బాధాకరం. ఈ ప్రమాదంలో బాలవెంగయ్య మృతి చెందడంతో ఆయన భార్య శారదమ్మ తమ పరిస్థితి ఏమిటంటూ, తన కుమార్తెల జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయంటూ కన్నీరుమున్నీరుగా గుండెలవిసేలా రోదించారు. ఇసుక టిప్పర్ తమ కుటుంబాలను సర్వనాశనం చేసిందని వారి బంధువులు శాపనార్థాలు పెట్టారు. ఈ బిడ్డల పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నేతల ధనదాహంతోనే ఇలా జరిగిందని, రెండు కుటుంబాలు సర్వనాశనమయ్యాయని బంధువులు విలపిస్తున్నారు.



గుర్రాలమడుగు సంఘంలో బాలవెంగయ్య, శారమ్మ ఇళ్ల వద్ద విషాద వాతావరణం

నా భర్తను చూపించండయ్యా...

తన భర్త బాలవెంగయ్య మృతి చెందాడని తెలుసుకున్న అతని భార్య శారదమ్మ ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపిస్తూ.. నా భర్తను చూపించండయ్య అంటూ గుండెలవిసేలా రోదిస్తూ కనిపించిన అందరిని పట్టుకుని అడుగుతుంటే చూపరుల కళ్లు చెమర్చాయి. కారులో విగతజీవి అయి మాంసం ముద్దగా ఉన్న బాలవెంగయ్య మృతదేహాన్ని చూపలేక పోలీసులు, కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు.

కన్నీరు పెట్టిన తనయుడు

తల్లి శేషం శారమ్మ మృతి చెందడంతో కుమారుడు తేజ కన్నీరుమున్నీరుగా విలపించారు. నెల్లూరు నుంచి వచ్చిన స్నేహితులు, కుటుంబ సభ్యులు అతడ్ని ఓదార్చలేకపోయారు. తండ్రి చనిపోయాడు. ఈ రోజు తల్లి కూడా పోయింది.. నాకెవరు దిక్కు అంటూ బోరున విలపించాడు.

డ్రైవర్ నా కొడుకే..

అయ్యా డ్రైవర్ బ్రహ్మయ్య నా కొడుకే.. ఎక్కడున్నాడో చూపించండయ్యా అంటూ అతని తల్లి వెంకట రమణమ్మ, అక్క పార్వతి కన్నీరుమున్నీరుగా విలపించారు. నా కొడుకు బ్రహ్మయ్యకు బాల వెంగయ్యతో పరిచయం ఉండడంతో కారు డ్రైవింగ్ కోసం ఆత్మకూరుకు వెళ్లాలని ఉదయాన్నే పిలుచుకెళ్లాడు. అంతే తిరిగి రాని లోకాలకు వెళ్లాడంటూ.. చేతికంది వచ్చిన కొడుకు మృత్యువాత పడడంతో మమ్మల్ని ఎవరు ఆదుకుంటారంటూ విలపిస్తుంటే.. స్థానికులు సైతం కంటతడి పెట్టారు.

బంధువుల ఆర్తనాదాలతో విదారకం

పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంతో వారి తరఫు బంధువులు ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. అందరూ దళిత కుటుంబీకులే. పరామర్శకు వస్తూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడడం చూసిన వారి హృదయాలను కలిచి వేసింది. పోస్టుమార్టం జరుగుతున్న ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకరంగా మారింది. ఆస్పత్రిలో పోస్టుమార్టం ప్రక్రియను



పోస్టుమార్టం గది వద్ద మృతుల బంధువులు, పోలీసులతో విషాద వాతావరణం



పోస్టుమార్టాన్ని పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ వేణుగోపాల్, సీఐలు



ఘటనా స్థలంలో రోదిస్తున్న బాధిత కుటుంబీలకును ఓదార్చుతున్న బంధువులు

పర్యవేక్షించేందుకు ఆత్మకూరు ఆర్డీఓ బి పావని, ఏఎస్పీ సౌజన్య, సీఐ నాగేశ్వరమ్మ, ఆత్మకూరు డీఎస్పీ కె వేణుగోపాల్, సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, ఎం గంగాధర్, పలు స్టేషన్ల ఎస్సైలు హాజరయ్యారు.

ఊరూరా విషాదఛాయలు

గుర్రాలముడుగు సంఘంలో విషాదఛాయలు అలముకున్నాయి. శారమ్మ, బాలవెంగయ్య కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. గుండెలవిసేలా రోదిస్తుండడంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. విషయం తెలుసుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె. సాంబశివరావు హుటాహుటిన అక్కడికి చేరుకుని వివరాలను సేకరించారు. వారి కుటుంబ సభ్యులను, బంధువులను ప్రత్యేక వాహనంలో ప్రమాదం జరిగిన ప్రాంతానికి పంపారు. ప్రమాద ఘటనపై వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. శారమ్మ, బాలవెంగయ్య అందరితో కలివిడిగా ఉంటేవారని అలాంటి వారిని మృత్యువు కబళించడం జీర్ణించుకోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను అన్నీ విధాలా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

స్టోన్‌హౌస్‌పేట సాలివీధిలో..

రోడ్డు ప్రమాదంలో తాళ్లూరు శ్రీనివాసులు, రాధమ్మ దంపతులు మృతి చెందడంతో వడ్డిపాళెంతో పాటుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సాలివీధిలో విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీనివాసులు దంపతులు కొంతకాలంగా సాలివీధిలో శ్యామ్ ఫాస్ట్‌ఫుడ్స్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఫంక్షన్లకు ఆర్డర్లపై టిఫిన్స్ సప్లయి చేసేవారు. నాణ్యమైన ఫుడ్ అందిస్తుండటంతో అనతికాలంలోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ బాగా క్లిక్ అయింది. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వివిధ ప్రాంతాలకు చెందిన వారు టిఫిన్ చేసేందుకు వచ్చేవారు. అందరితో శ్రీనివాసులు కలివిడిగా ఉండేవారు. ఎప్పటిలాగే టిఫిన్ చేసేందుకు కస్టమర్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు వచ్చారు. సెంటర్ మూసి ఉండటంతో పక్క దుకాణదారుల ద్వారా విషయం తెలుసుకుని బాధపడ్డారు.

మేకపాటి విక్రమ్‌రెడ్డి సంతాపం

పెరమన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సమీప బంధువులు ఏడుగురు మృతి చెందడం బాధాకరమని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న ఆయన పోలీసు అధికారులకు ఫోన్ చేసి ప్రమాద స్థలం వద్ద సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి మరే కుటుంబంలోనూ జరగకూడదన్నారు. తల్లిదండ్రులను, మరో కుటుంబంలో పిల్లలను కోల్పోయిన వారి బాధ తీర్చలేనిదని, వారికి ప్రభుత్వ పరంగా జరగాల్సిన అన్ని సహాయ చర్యలు వెంటనే చేపట్టాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి సంతాపం..

నెల్లూరు జిల్లాలో కూటమి నేతల ధనదాహం కారణంగా ఇసుక అక్రమ రవాణా ఏడుగురు ప్రాణాలను బలి తీసుకున్న విషాదకర ఘటన బాధాకరమని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి బంధువులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై దృష్టి సారించి, సమగ్ర విచారణ జరిపి, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఇందుకూరుపేటలో..

ఇందుకూరుపేట: సంగం మండలం పెరమన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందుకూరుపేట దళితవాడ (అరుంధతీయవాడ)కు చెందిన చల్లగుండ్ల శ్రీనివాసులు, భార్య లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందడంతో ఇందుకూరుపేటలో విషాదం నెలకొంది. రోజులాగే కూలీలను ఎక్కించుకొని నరుకూరు రోడ్డులో వదిలారు. అక్కడ నుంచి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు ఆటోలో నెల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. కుమార్తె చందు ప్రియ, కుమారుడు విశ్వంత్ స్కూల్‌కు వెళ్లారు. భార్యాభర్తలు ఇరువురు బంధువులతో కలిసి కారులో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. అప్పటి వరకు తమ కళ్ల ఎదుటే ఉన్న శ్రీనివాసులు, లక్ష్మి అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో దళితవాడ వాసులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తల్లిదండ్రులను ఇద్దరిని కోల్పోవడంతో బిడ్డలిద్దరు అనాథలుగా మిగిలిపోయారు.

ఘటనా స్థలిని పరిశీలించిన ఎస్పీ



సంగం: రోడ్డు ప్రమాద ఘటనా స్థలిని బుధవారం రాత్రి ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. రోడ్డు ప్రమాద కారణాలను, మృతుల వివరాలు, ప్రమాదానికి కారణమైన ఇసుక టిప్పర్ డ్రైవర్, యజమాని వివరాలను స్థానిక సీఐ కె. వేమారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని, ఇప్పటికే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతన్న గోడు పట్టని సీఎం



- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ధాన్యం ధరలు రోజురోజుకూ దిగజారుతున్నా.. మాటలతో సీఎం చంద్రబాబు కాలయాపన చేస్తూ రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని మహ్మదాపురంలో బుధవారం ఆయన పర్యటించారు. తనను కలిసిన రైతులతో వివిధ సమస్యలపై చర్చించిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో క్వింటాల్ ఉల్లి ధరలు రూ.3500 ఉండగా, ఇప్పుడు రూ.600కు పతనమయ్యాయని చెప్పారు. వరి పండించిన రైతులు గిట్టుబాటు ధరల్లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. సూపర్‌సిక్స్ పథకాల్లో కొన్నింటిని అసలు పట్టించుకోకపోగా, మిగిలిన వాటిని తూతూమంత్రంగా అమలు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా అందక రైతులు నానా అగచాట్లు పడుతుంటే, చంద్రబాబు మాత్రం పూటకో మాట మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయించి నిర్మిస్తే, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడం రాష్ట్ర ప్రజలను కలిచివేస్తోందని తెలిపారు.

విషప్రచారానికి తెరలేపిన బాబు

చంద్రబాబు, ఆయన అనుకూల పత్రికలు, మీడియా విషప్రచారానికి తెరలేపాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు వీల్లేకుండా, వారి ఆశలపై నీరుజల్లుతూ ఆయన తీసుకున్న నిర్ణయాలే మేలైనవిగా ప్రచారం చేయించుకుంటున్నారని విమర్శించారు. రూ.లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రచారార్భాటంలో చూపే చొరవ కార్యరూపంలో లేదని ఎద్దేవా చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పార్టీ నేత, సొసైటీ మాజీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి తల్లి పెంచలమ్మ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. నేతలు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, కరిపరెడ్డి కృష్ణారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, మాలకొండారెడ్డి, కోనం బ్రహ్మయ్య, కమలాకర్‌రెడ్డి, రమణారెడ్డి, లచ్చారెడ్డి, చెంచుకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ధనదాహమే..



సంగం: పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఐదుగురు దళిత కుటుంబాల్లో పెనువిషాదం నింపింది. ఓ టీడీపీ నేత ధనదాహం ఏడుగురిని కబళించింది. ఇసుక తవ్వకాలు, రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోయినా.. అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా అక్రమ రవాణా చేస్తున్నారు. సామర్థ్యానికి మించి ఇసుక లోడ్ చేసుకుని మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రజల ప్రాణాలు హరిస్తున్నారు. పెరమన దుర్ఘటనకు కారణమైన AP 39 WH 1695 టిప్పర్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏఎస్‌పేట మండలం చిరమనకు చెందిన కాటం రవీంద్రారెడ్డికి చెందిన కేపీఆర్ మైన్స్ పేరుతో ఉన్నట్లు గుర్తించారు. మైనింగ్ కంపెనీ చాటున చేజర్ల మండలం పెరుమాళ్లపాడు, అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రమాదం జరిగిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. అయితే ఏడుగురు మృత్యువాతకు కారణమైన టిప్పర్ దేశం నేతది కావడంతో ఈ కేసు తారుమారుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. డ్రైవర్‌గా మరో వ్యక్తిని బలి చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని సమాచారం.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.147
లేయర్	: రూ.115
బ్రాయిలర్ చికెన్	: రూ.260
స్కిన్‌లెస్ చికెన్	: రూ.286
లేయర్ చికెన్	: రూ.195

అక్షరమే ఆయుధం



జర్నలిజానికి సంకెళ్లు సిగ్గుచేటు



పాలకులు చేసే తప్పులను జర్నలిస్టులు ఎత్తి చూపుతారు. వాస్తవాలను తమ కలం ద్వారా వెలుగులోకి తెస్తున్న వారిపై, పత్రికలపై అక్రమ కేసులు పెట్టడం జర్నలిజానికి సంకెళ్లు వేసినట్టే. ఇలాంటి చర్యలు సిగ్గుచేటు. ప్రజా సమస్యలపై వార్తలు రాశారనే కక్షతో సాక్షి ఎడిటర్ తోపాటు ఆ పత్రిక జర్నలిస్టులపై ప్రభుత్వం కేసులు పెట్టడం దుర్మార్గం. ఇకనైనా కేసులు ఎత్తివేయాలి. – కొండా ప్రసాద్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సీపీఎం కార్యదర్శి

ప్రశ్నించే గొంతు నొక్కుతున్నారు



ఏ ప్రభుత్వం తప్పు చేసినా వార్తల ద్వారా జర్నలిస్టులు ప్రశ్నిస్తారు. తప్పులు, మోసాలను ఎత్తి చూపినందుకు కూటమి ప్రభుత్వం సాక్షి పత్రికపై కక్ష పెంచుకుంది. ఆ పత్రిక ఎడిటర్, జర్నలిస్టుల గొంతు నొక్కుతోంది. ఇలాగే చేస్తే ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి మెప్పు పొందాలి. ప్రజా గొంతుకలైన పత్రికలను బెదిరించడం మంచిది కాదు.

– కృష్ణమూర్తి, సోషల్ వర్కర్, బుజబుజనెల్లూరు

జింకను వధించిన కేసులో రిమాండ్



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): రూరల్ మండల పరిధిలోని ఆమంచర్ల ఎస్టీ కాలనీకి చెందిన నంబూరి నాగయ్య అనే వ్యక్తి బుధవారం మట్టెంపాడు వద్ద ఉచ్చు బిగించి చుక్కల జింకను వధించాడు. మాంసాన్ని అక్కడే అమ్ముతుండగా ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. రేంజ్ ఆఫీసర్ మాల్యాద్రి ఆధ్వర్యంలో ఆమంచర్ల ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసులు, దొంతాలి బీట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి నాగయ్యను పట్టుకున్నారు. కిలో జింక మాంసం, తల, చర్మంతో సహా స్వాధీనం చేసుకుని నెల్లూరులోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. అనంతరం నెల్లూరులో కోర్టు వారికి అప్పగించగా ముద్దాయికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మాల్యాద్రి మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి



గాయపడిన డ్రైవర్ వెంగళరెడ్డి

ఆత్మకూరు: బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన బుధవారం జరిగింది. ఆత్మకూరు డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంగళరెడ్డి వింజమూరు మార్గంలో బస్సును తీసుకెళ్లాడు. తిరిగి ఆత్మకూరుకు వస్తున్న క్రమంలో అప్పటికే వంద మంది పైనే జనం ఉన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రయాణం ఉచితమంటూ ప్రకటించి దానికి తగిన బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో గంటల కొద్ది వేచిచూస్తున్న మహిళలు వచ్చిన బస్సులోనే ఒకరిపై ఒకరు తోసుకుంటూ ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. నబ్బీనగరం వద్ద పలువురు ప్రయాణికులు ఆత్మకూరుకు వచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. అప్పుడే ఆ బస్సు వచ్చింది. స్థలం లేకపోవడంతో అక్కడి వారు చేయి చూపించినా ఆపకుండా డ్రైవర్ ముందుకు వచ్చేశాడు. దీంతో ఆ గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి మోటార్‌బైక్‌పై వచ్చి బస్సును క్రాస్ చేసి అడ్డుగా పెట్టాడు. బస్సు ఎందుకు గ్రామంలో ఆపలేదంటూ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. అతని తల, చేతికి గాయాలయ్యాయి. పలువురు సర్ది చెప్పడంతో వెంగళరెడ్డి గాయపడినా బస్సును ఆత్మకూరుకు తీసుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎస్‌కే జిలానీ కేసు నమోదు చేశారు.

అదనపుకట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపుకట్నం కోసం వివాహితను ఇంటి నుంచి గెంటేయడంతోపాటు వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటివారిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. వెంకటరెడ్డినగర్‌కు చెందిన బింధు మాధవికి కావలికి చెందిన మహేష్‌తో గతేడాది పెద్దల సమక్షంలో వివాహమైంది. అప్పుడు వధువు కుటుంబ సభ్యులు కట్న కానుకల కింద రూ.1.50 లక్షల నగదు, 13 సవర్ల బంగారం మహేష్ కుటుంబానికి ఇచ్చారు. రెండునెలలు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటివారు అప్పులున్నాయని రూ.10 లక్షలు కట్నం తీసుకురావాలని మాధవిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలో అత్తింటివారు ఆమెను పుట్టింట్లో వదిలారు. అప్పటి నుంచి ఆమె పెద్దల ద్వారా మాట్లాడినా వారిలో మార్పురాలేదు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యోర్లకు పోస్టింగ్ ఎక్కడో?

- జిల్లాకు కొత్తగా 657 మంది
- రేపు నియామకపత్రాల అందజేత
- ఇప్పటికే 192 మంది సర్‌ప్లస్ టీచర్లు
- కొత్తవారు సైతం క్లస్టర్లకే పరిమితమా?
- సెలవు పెట్టిన లేదా రిటైరైన వారి స్థానంలో బోధన



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

నెల్లూరు(టౌన్): కొత్త ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి విద్యాశాఖలో గందరగోళం నెలకొంది. జిల్లాలో పూర్తి స్థాయిలో సర్దుబాటు చేసి ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం హడావుడిగా ఎక్కువ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన పరిస్థితి ఉంది. ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏలు) సర్‌ప్లస్‌లో ఉండగా వారిని క్లస్టర్లకు కేటాయించారు. కొత్తగా 542 మంది ఎస్‌ఏలు జిల్లాకు రానున్నారు. వీరి నియామకం కోసం జిల్లాలో ఎక్కడా ఖాళీల్లేవు. దీంతో క్లస్టర్లకు కేటాయించిన పరిస్థితి ఏర్పడింది. ఇంకా 400కు పైగా ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 115కు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ క్లస్టర్లలో 532 పోస్టులను కేటాయించింది. జిల్లాలోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు సెలవు పెడితే వారికి విధులు కేటాయించనున్నారు. దీంతోపాటు రిటైరైన వారి స్థానంలో క్లస్టర్లలో ఉన్న అయ్యోర్లను ఆ పాఠశాలకు పంపించే ఆలోచనలో విద్యాశాఖ అధికారులున్నారు.

అలా చేయకుండా..

సాధారణంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే సమయంలో రీ అపోర్షన్‌మెంట్ చేసిన తర్వాతే ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి. అయితే ప్రభుత్వం హడావుడి, హంగామా కారణంగా జిల్లాలో అవసరానికి మించి నోటిఫికేషన్ విడుదల చేశారు. మిగులు పోస్టులను పరిగణలోకి తీసుకోలేదు. ఖాళీలను పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది ఫిబ్రవరిలో 673 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీరిలో 657 మందికి నియామకపత్రాలు అందజేయనున్నారు. అభ్యర్థులు లేరనే కారణంతో 16 పోస్టులను ఖాళీగా ఉంచారు. అయితే మే, జూన్ నెలల్లో ఉపాధ్యాయులకు రీ అపోర్షన్‌మెంట్ జరిగింది. మిగులు ఉపాధ్యాయులకు ఖాళీ పోస్టులున్న పాఠశాలల్లో అవకాశం కల్పించారు. జిల్లాలో 192 మంది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ ఉన్నట్లు విద్యాశాఖ తేల్చింది. వీరు, కొత్తగా వచ్చే 542 మంది ఎస్‌ఏలను క్లస్టర్లకే పరిమితం చేయనున్నట్లు తెలిసింది. అయితే సర్‌ప్లస్‌లో ఉన్న వారిని ఎస్జీటీ పోస్టులకు పంపనున్నారా అనే దానిపై సందిగ్ధం నెలకొంది. దీనిపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు.

వారిలో ఆందోళన

కొత్తగా వచ్చే స్కూల్ అసిస్టెంట్లకు జిల్లాలో రిటైరైన వారి స్థానంలో పోస్టింగ్ ఇస్తే ఇప్పటికే క్లస్టర్లలో ఉన్న టీచర్లు వారి కంటే జూనియర్లవుతారు. దీంతో పదోన్నతుల్లో అన్యాయం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

పబ్లిసిటీ పిచ్చితో..

కొత్త ఉపాధ్యాయ నియామకంలో ప్రభుత్వం పబ్లిసిటీ పిచ్చి పీక్‌కు చేరింది. నియామకపత్రాలను ఈనెల 19న విజయవాడలో సీఎం చేతుల మీదుగా అందజేయాలని నిర్ణయించారు. జిల్లాలో ఎంపికైన వారు ఒక సహచరుడిని తీసుకుని రావొచ్చని ప్రకటించారు. మొత్తం 1,314 మంది కానున్నారు. వీరంతా గురువారం వెంకటాచలం మండలం గొలగమూడిలో రిపోర్టు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాత్రి అక్కడ ఉంచి మరుసటి రోజు బస్సుల్లో విజయవాడకు తీసుకెళ్లనున్నారు. ఇందుకు 31 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. రూ.13.02 లక్షలకు పైగా ఖర్చువుతుంది. దీంతోపాటు అందరికీ అల్పాహారం, భోజనాలు, వసతులు తదితర వాటికి మరో రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలు అవ్వొచ్చు. అంటే జిల్లాకు రూ.18 లక్షల నుంచి రూ.19 లక్షలు ఖర్చు పెట్టనున్నారు. కూటమి ప్రభుత్వం పబ్లిసిటీ కోసం ఇంత మొత్తం ఖర్చు చేయాల్సిన అవసరం ఉందా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తప్పనిసరిగా రావాలి

ఎంపికైన ఉపాధ్యాయులు గురువారం సాయంత్రం 4 గంటల్లోపు గొలగమూడిలో తప్పనిసరిగా రిపోర్టు చేయాలని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం 6 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. నియామకపత్రాలు అందుకునే టీచర్లు ఆధార్, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, (ఉపాధ్యాయుడు, సహచరుడు ఫొటోలు), డీఎస్సీ హాల్ టికెట్ తెచ్చుకోవాలన్నారు.

క్లస్టర్లు, రిటైర్‌మెంట్ స్థానాల్లో పోస్టింగ్



జిల్లాలో ఆగస్టు వరకు రిటైరైన ఉపాధ్యాయులను పరిగణలోకి తీసుకుని కొత్త టీచర్లకు పోస్టింగ్ ఇస్తాం. ఇప్పటికే రిటైర్‌మెంట్‌తో కొన్ని స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటిని భర్తీ చేస్తాం, మిగిలిన కొత్త టీచర్లను ఆయా మండలాల్లోని క్లస్టర్లకు కేటాయిస్తాం. అక్కడి నుంచి వారి సేవలను వినియోగించుకుంటాం. సీనియారిటీ విషయంలో అన్యాయం జరగదు.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

కసుమూరులో కానరాని ఏర్పాట్లు



చందన్‌మహల్ వద్ద అరకొరగా వేసిన షామియానాలు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గా 248వ గంధ మహోత్సవాలు గురువారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాలకు సంబంధించి భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు వక్ఫ్ బోర్డు అధికారులను ఆదేశించారు. వేలాది మంది భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏటా ముందస్తుగా ఏర్పాట్లు చేసేవారు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డు అధికారుల నిర్లక్ష్యంపై దర్గా ముజావర్లు, భక్తులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఉత్సవాలకు రూ.16 లక్షలతో వసతులు కల్పించాల్సి ఉన్నా, విద్యుద్దీపాలంకరణ, దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇంకా తాగునీరు, మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

క్లుప్తంగా

రైల్లోంచి జారిపడి..

- వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): రైల్లోంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం పొగతోటలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు 30 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండొచ్చు. లేత కాఫీ రంగు టీ షర్టు, బులుగు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

రంగనాయకులపేట సమీపంలో..

రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఉదయగిరిలోని యాదవపాళేనికి చెందిన చెమికల తిరుపతయ్య (60)కు ఆరోగ్యం బాగోలేకపోవడంతో నెల్లూరులో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రంగనాయకులపేట రైల్వే గేటు సమీపంలో కావలి వైపు వెళ్లే పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆధార్‌కార్డు ఆధారంగా బాధిత కుటుంబానికి సమాచారం అందించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు సమీపంలో రోడ్డుపై నడిచి వెళుతున్న వృద్ధురాలిని గుర్తుతెలియని యువకుడు బుధవారం రాత్రి బైక్‌పై వెంబడించాడు. జనసామర్థ్యం తక్కువగా ఉన్న చోట ఆమె మెడలోని ఐదుసవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. బాధితురాలు అరిచేలోపే దుండగుడు పరారయ్యాడు. స్థానికులు ఆమెను రోడ్డుపక్కన కూర్చొబెట్టి బాలాజీ నగర్ పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15

బేస్‌బాల్ ఎంపికలపై వివాదం

- భారత జట్టుకు అంటూ నిర్వాహకుల ప్రచారం
- ప్రశ్నించిన వివిధ క్రీడా సంఘాల నేతలు



బేస్‌బాల్ ఆడుతూ..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బేస్‌బాల్ ఇండియా జట్టు ఎంపికల పేరుతో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో హడావుడి జరిగింది. నాలుగో బీఎఫ్‌ఏ ఉమెన్స్ బేస్‌బాల్ ఆసియా కప్ సెలక్షన్ ట్రైల్స్ పేరుతో మంగళవారం స్టేడియంలో ఎంపికలు మొదలయ్యాయి. ఈ వ్యవహారంపై బుధవారం స్థానిక క్రీడాకారులు, క్రీడా సంఘ నేతలు నిర్వాహకులను ప్రశ్నించారు. వసతుల్లేని చోట భారతదేశ జట్టును ఎంపిక చేయడం ఏంటని అడిగారు. కానీ వారి నుంచి సరైన సమాధానం రాలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ అనుమతి ఇచ్చారని వారు చెప్పారు. నేతలు నిర్వాహకుడి గురించి ఆరా తీస్తే నవలాకులతోట జెడ్పీ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడని తెలిసింది. ఫొటోలు తీయడం మొదలుపెట్టగానే అక్కడ కట్టిన ఫ్లెక్సీలను తీసేశారు. క్రీడాకారులు, నిర్వాహకులు వెళ్లిపోయారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంపికలంటూ రూ.లక్షలు దండుకుని తల్లిదండ్రులను మోసం చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని నేతలు కోరుతున్నారు. ఆటలాడేందుకు అనుమతిచ్చామని, అంతర్జాతీయ స్థాయి ఎంపికలకు ఎటువంటి పత్రాలు చూపించలేదని డీఎస్‌డీఓ అధికారులు చెబుతున్నారు.

బంగారు దుకాణాల్లో ఐటీ సోదాలు

- నెల్లూరులో ఏకకాలంలో..
- ఓ గోల్డ్, డైమండ్స్ వ్యాపారి ఇంట్లోనూ..
- బిల్లులు, రికార్డుల పరిశీలన



తనిఖీలు చేసేందుకు వచ్చిన అధికారులు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని రెండు బంగారు దుకాణాలపై కేంద్ర ఆదాయపన్ను శాఖ అధికారుల బృందాలు బుధవారం మెరుపుదాడులు నిర్వహించాయి. ఆచారివీధి, కాపువీధి తదితర ప్రాంతాల్లో ఉన్న డీపీ, జేటీ హోల్‌సేల్ బంగారు దుకాణాలు, వాటి యజమానుల నివాసాల్లో వేకువజాము నుంచి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దీంతో బంగారు వ్యాపారుల్లో కలకలం రేగింది. ప్రధాన నగరాలతోపాటు హోల్‌సేల్ వ్యాపారం నిర్వహించే గోల్డ్ షాప్‌ల లక్ష్యంగా అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. నిత్యం కిలోల కొద్ది బంగారం క్రయవిక్రయం చేసే హోల్‌సేల్ దుకాణాల నిర్వాహకులు అందుకు సంబంధించిన లావాదేవీలు సక్రమంగా నిర్వహించలేదన్న ఫిర్యాదులు, ఆరోపణలు, బిల్లుల చెల్లింపు, రాబడి, ఖర్చు తదితర వివరాలను రికార్డుల్లో సరిగ్గా పొందు పరచలేదన్న ప్రధాన కారణంగానే ఈ దాడులు జరిగినట్లు తెలిసింది. ఇటీవల బంగారం ధరకు నియంత్రణ లేకపోవడంతోపాటు కొద్దికాలంలోనే సుమారు 500 కిలోల బంగారానికి సంబంధించి ఆదాయపన్ను ఎగవేతకు పాల్పడ్డారన్న పక్కా సమాచారంతో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. ఆయా దుకాణాలతో పాటు యజమానులకు చెందిన ఆచారివీధి, కాపువీధి, పాత జెడ్పీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉన్న వారి గృహాల్లో సైతం సోదాలు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు జరిగాయి. స్థానిక పోలీస్, ఐటీ అధికారులకెవరికీ సమాచారం లేకుండానే కేంద్ర బలగాలతో నిర్వహించిన మెరుపు దాడులతో వ్యాపారులు ఉలిక్కి పడ్డారు. దీంతో నగరంలోని వందల సంఖ్యలో ఉన్న రిటైల్ బంగారు వ్యాపార సంస్థలు, పదుల సంఖ్యలో ఉన్న హోల్‌సేల్ వ్యాపార సంస్థలు మూతపడ్డాయి.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేట మండలం రాముడుపాళేనికి చెందిన జయకృష్ణ (31)కు ఏడేళ్ల క్రితం ఆదూరుపల్లికి చెందిన లక్ష్మీతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. జయకృష్ణ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల దంపతుల నడుమ విభేదాలు వచ్చాయి. నాలుగు రోజుల క్రితం లక్ష్మి భర్తపై అలిగి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. మంగళవారం జయకృష్ణ భార్య వద్దకు వెళ్లి కాపురానికి రావాలని కోరాడు. అక్కడ ఏం జరిగిందో తెలియదు గానీ అదేరోజు రాత్రి అతను నెల్లూరుకు చేరుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత నవాబుపేట శివాలయం సమీపంలో రోడ్డుపైనున్న ఐరన్‌పోల్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి అన్న హరికృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై భోజ్యానాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.